క్లుప్తంగా

హామీల అమలు ఏది?



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య

చండ్రుగొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య విమర్శించారు. చండ్రుగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల హామీ అరకొరగానే అమలవుతోందని ఆరోపించారు. ఎలాంటి షరతులూ లేకుండా రైతుల రుణాలన్నీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరారు. సీతాయిగూడెం ప్రాజెక్టు సత్వరమే మరమ్మతులు చేయాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పెద్దిని వేణు, వి.వెంకటేశ్వర్లు, కాకా సీత, ఆర్ వెంకటాచారి, గాలి రామారావు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాధునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు ప్రాంతానికి చెందిన జెన్నెల నారాయణరావు–హేమలత దంపతులు, వారి కుమార్తెలు జ్ఞానశ్రీ, శ్రావ్యశ్రీలు, ఆనంద్ యాదవ్–లావణ్య దంపతులు, శాన్విక, లిఖిత్‌రామ్‌లు ఆలయంలోని సాయినాధుడిని దర్శించుకుని పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం జెన్నెల నారాయణరావు కుటుంబ సభ్యులుఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. ఆనంద్ యాదవ్ కుటుంబ భక్తులు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం అన్నదాత దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్.బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలి

కరకగూడెం: మండల కేంద్రంలోని చికెన్ దుకాణాల్లో పరిశుభ్రత పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు గ్రామాల ప్రజలు గురువారం కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని చికెన్ దుకాణదారులు వ్యర్థాలను డ్రెయినేజీల్లో వదలడంతో దుర్వాసనలు వెదజల్లుతోందని, పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సదరు దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. ఎర్ర సురేష్, బుడగం రాము, జలగం కృష్ణ, కొమరం రాంబాబు, ముంజాల సాయిబాబా, కటకం లెనిన్, కొలగాని రవికుమార్, నాలి రామకృష్ణ పాల్గొన్నారు.

నిందితుడిని శిక్షించాలి

గుండాల: ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసి చిత్రహింసలకు గురి చేసినటువంటి వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకొని బహిరంగంగా ఉరితీయాలని తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు కొడెం వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నింధితుని బహిరంగంగా శిక్షించాలని తుడుం దెబ్బ డిమాండ్ చేస్తుందని తెలిపారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను చేపడతామని పేర్కొన్నారు.

ఐద్వా మండల నూతన కమిటీ ఎన్నిక

అశ్వారావుపేటరూరల్: ఐద్వా మండల నూతన కమిటీను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని నందిపాడు గ్రామంలో ఐద్వా నాలుగవ మండల మహాసభను నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి హాజరు కాగా, ఆమె పర్యవేక్షణలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షురాలిగా మడకం సత్యవతి, కార్యదర్శిగా తగరం నిర్మల, ఉపాధ్యక్షురాలిగా మనుగొండ సత్యవతి, సహాయ కార్యదర్శులుగా మొడియం తిరుపతమ్మ, పట్టెల మంగ, మరికొంతమందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఎస్సీ వర్గీకరణపై పునరాలోచన చేయాలి

చండ్రుగొండ: ఎస్సీ వర్గీకరణపై పునరాలోచన చేయాలని మాల మహానాడు ఆధ్వర్యంలో సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్యకు వినతిపత్రం అందించారు. పెరిగిన షెడ్యూల్ కులాల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ రామారావు, బడుగు గణేష్, సురేష్, నాగబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

- గత ప్రభుత్వ హయాంలోని నిర్మాణాలతో కాలనీల్లో వరద
- ముంపు బాధితులకు చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పాయం



ఆర్థిక సాయం చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: భారీవర్షాలతో ముంపునకు గురైన పినపాక నియోజకవర్గంలోని 2,030 కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. వర్షాలతో ముంపునకు గురై నష్టపోయిన మణుగూరు వాగు మల్లారం, సుందరయ్య నగర్, ఆదర్శనగర్, కూనవరం రైల్వేగేట్ వాసులకు మంజూరైన రూ.16,500 చొప్పున చెక్కులను అధికారులతో కలిసి వారి నివాసాల వద్ద పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలో 2,030 కుటుంబాలకు నష్టం వాటిల్లగా, వారి ఖాతాల్లో పరిహారం జమ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, వరదలతో మృతి చెందిన మూడుకుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున పరిహారం అందించామని చెప్పారు. నష్టపోయిన పంటల సర్వే జరుగుతోందని, మృత్యువాత పడిన పశువులకు కూడా రూ.50వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. కాగా, ఇల్లు కోల్పోయిన వారికి తొలివిడుతలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో కట్టువాగుకు అడ్డంగా కట్టిన చెక్‌డ్యాంతో సుందరయ్య నగర్ ముంపునకు గురైందన్నారు. అలాగే, మణుగూరులో ప్రవహించే కట్టువాగులోకి సింగరేణి నీటి విడుదల, కోడిపుంజుల వాగుపై అనాలోచిత నిర్ణయంతో కట్టిన బ్రిడ్జి కూడా ముంపునకు కారణమన్నారు. తహసీల్దార్ రాఘవరెడ్డి, కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, కూచిపూడిబాబు, గణేశ్‌రెడ్డి, తిరుమలేశ్, గాండ్ల సురేశ్, పాతూరి వెంకన్న, కొర్సా ఆనంద్, మానస, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని చదును చేశారు..



చదును చేసిన భూమి, రేకుల షెడ్డును పరిశీలిస్తున్న ఆర్‌ఐ భద్ర

ములకలపల్లి: ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ భూమిని చదును చేసి, తాత్కాలికంగా రేకుల షెడ్డు నిర్మించడం చర్చనీయాంశంగా మారింది. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వివరాలు సేకరించారు. మండలపరిధిలోని మూకమామిడి ప్రాజెక్ట్ అతి దగ్గరలో అటవీ, ప్లాంటేషన్ భూములు ఉన్నాయి. వీటికి మరో పక్క ప్రయివేటు వ్యక్తుల భూముల్లోనూ జామాయిల్ సాగు చేస్తున్నారు. ఈ ప్రదేశానికి పక్కనే ఉన్న గుట్టబోడులాంటి ప్రదేశంలో యంత్రాల సాయంతో సుమారు అర ఎకరం విస్తీర్ణంలో చెట్లు, పొదలు తొలగించి శుభ్రం చేశారు. రేకులతో చిన్నపాటి షెడ్డు కూడా నిర్మించారు. ఈక్రమంలో తహసీల్దార్ గుడ్ల పుల్లారావు ఆదేశాల మేరకు గురువారం ఆర్‌ఐ–2 భద్రు ఘటనా ప్రదేశాన్ని సందర్శించి, సమగ్ర విచారణ చేపట్టారు. సాయిరాంపురం గ్రామానికి చెందిన కొర్సా ముత్యాలు అనే వ్యక్తి ఇంటి నిర్మాణమై కొన్ని నెలల క్రితమే షెడ్డు నిర్మించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. చుట్టుపక్కల ప్రభుత్వ భూమిని సైతం ఇటీవలె చదును చేసినట్లు గుర్తించారు. ముత్యాలును రేకుల షెడ్డు తొలగించి, తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపినట్లు ఆర్‌ఐ భద్రు విలేకరులకు తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి జెడ్పీ పాఠశాలలోని 50 మంది విద్యార్థుస్తులను తన సొంత ఖర్చులతో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోను రాణించాలన్నారు. క్రీడల వల్ల శారీరక ఆరోగ్యం తో పాటు మంచి జీవనశైలి, శక్తి సామర్థ్యాలు, స్నేహభావం పెంపొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామసభలో తహసీల్దార్‌ను సన్మానిస్తున్న స్థానికులు

దుమ్ముగూడెం: మండలంలోని దబ్బనూతుల, కొత్తూరు,కమలాపురం గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలపై తహసీల్దార్ ఎం.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలలో వివిధ సమస్యలపై 21 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ భూ సమస్యలు వల్ల చాలా మంది రైతులు బ్యాంకు లోన్‌లు, రైతు బంధులు, రైతు బీమాలు, త్రి ఫేస్ కరెంట్, పంట బోర్లు పొందలేకపోతున్నామని ఆయన దృష్టికి తీసుకునివచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామస్తులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మొదటి సారి గ్రామంలో పర్యటించినందుకు తహసీల్దార్‌ను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విరామచినేని వినీల్, పార్టీ యువజన నాయకులు తోట రమేష్, గ్రామ పెద్దలు సొందే ముద్దరాజు, సొందే చలపతి, సొందే మహేష్,సొందే నాగరాజు, రాజేంద్ర, లింగయ్య, ప్రశాంత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు

కరకగూడెం: ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం మండల పరిధిలోని కొత్తగూడెం, రాయనిపేట గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. సుమారు 71మంది గ్రామస్తులను పరీక్షించారు. అందులో పలువురిని జ్వర పీడితులను గుర్తించి మందులను అందజేశారు. మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో నిలువ ఉన్న నీటినీ సిబ్బందితో పారబోయించారు. అనంతరం మండల కేంద్రంలోని రక్త పరీక్ష కేంద్రాలు, ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్‌ఈఓ పోలెబోయిన కృష్ణయ్య, ఆరోగ్య సహాయకులు నర్సింహారావు, కృష్ణ, ఆశా కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాలొన్నారు.

ఏచూరి మరణం పార్టీకి తీరనిలోటు

భద్రాచలంటౌన్: సీపీఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి మరణం సీపీఎం పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సీతారాం ఏచూరి సంతాప సభలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో బాల నర్సారెడ్డి, బండారు శరత్, గద్దం స్వామి, తిలక్, లీలావతి, పి.సంతోష్ కుమార్, నాగరాజు, డి.లక్ష్మి, జీవనజ్యోతి, భూపేందర్, కుంజ శీను, రత్నం, శ్రీనివాస్, జి.లక్ష్మీకాంత్, ఎస్ అజయ్ కుమార్, డి.రామకృష్ణ, సతీష్ కుమార్, శ్రీనివాస్, పోషాలు, ఆది, తదితరులు పాల్గొన్నారు.

'పొదెం' సంతాపం..

కమ్యూనిస్టు పార్టీ దేశ నేత సీతారాం ఏచూరి మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య గురువారం ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి తనదైన శైలిలో పాత్ర పోషించారన్నారు.



భద్రాచలంటౌన్: సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అశ్వాపురం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి బాధాకరమని సీపీఎం మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో, మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో గురువారం సీతారాం ఏచూరి చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు.

ఫిట్టర్ ఖాళీలను భర్తీ చేయాలి

మణుగూరుటౌన్: ఏరియాలోని ఉపరితల గనులపై ఉన్న ఫిట్టర్ ఖాళీలను కేపీయూజీ అండర్ గ్రౌండ్ ఫిట్టర్ కార్మికులతో భర్తీ చేయాలని కోరుతూ టీబీజీకేఎస్ నాయకులు ఏరియా ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు నాగెల్లి వెంకట్ మాట్లాడుతూ.. ఏరియాలోని ఉపరితల గనులపై ఫిట్టర్ పోస్టులు భర్తీ చేయకుండా డిప్యుటేషన్‌పై పనులు చేయించడం సరికాదని తెలిపారు. ఏరియాలో ఉన్న పనులకు అనుగుణంగా ఫిట్టర్ సంఖ్య లెక్కలపై యాజమాన్యం మరోమారు సమీక్షించి ఏరియా ప్రగతి దెబ్బతినకుండా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్‌కుమార్, మస్తాన్, వినయ్‌కుమార్, బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు లేకుండా చూడాలి

దమ్మపేట: నియోజకవర్గం వ్యాప్తంగా రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. గురువారం గండుగులపల్లిలోని మంత్రి తుమ్మల నివాసంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, తుమ్మలను కలవగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీటీ రోడ్లు, ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాలలో రహదారులపై గుంతలు లేకుండా చూడాలని కోరారు. నియోజకవర్గ రహదారులపై స్పెషల్ ఫోకస్ చేయాలని ఎమ్మెల్యేకు సూచించారు.

బీట్ ఆఫీసర్‌కు నివాళి

అశ్వాపురం: అనారోగ్యంతో మృతి చెందిన ఇల్లందు మండలం లలితాపురం చెక్‌పోస్ట్ బీట్ ఆఫీసర్ మండల పరిధిలోని గొందిగూడెం కొత్తూరు గ్రామానికి చెందిన బండ్ల బాలరాజు (56) మృతదేహానికి గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, కాకా రాములు, తూము వీరరాఘవులు, మాజీ ఎంపీటీసీ చిట్టెమ్మ, ఆవుల రవి, బారాజు సంపత్, బండ్ల మునీశ్వరరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దవాఖానాకు తీరని ముంపు కష్టాలు



పైలట్‌కాలనీ పల్లె దవాఖానాలో ఆరబెట్టిన పుస్తకాలు

మణుగూరుటౌన్: భారీ వర్షాలతో ఆగస్టు 31న రాత్రి మణుగూరు మున్సిపాలిటీ పూర్తి ముంపునకు గురైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో వరద ముంపు తొలిగి రెండు వారాలు గడిచినా పైలట్ కాలనీ పల్లె దవాఖానాను ముంపు కష్టాలు మాత్రం వీడడం లేదు. పల్లె దవాఖానా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. శిథిలావస్థకు చేరిన ఫ్లోరింగ్, ముంపుకు కొట్టుకువచ్చిన మట్టి, చెత్త దుర్వాసన, పాడై పోయిన మెడిసిన్ అక్కడే ఉండటంతో పాటు పరిసరాలు నేటికీ అపరిశుభ్రంగా ఉండటంతో పూర్తిస్థాయి వైద్యం అందించలేక, మందులు స్టోరేజీకి స్థలం లేక సిబ్బంది తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పుస్తకాలు, రికార్డులు పూర్తిగా తడిచిపోగా వాటిని ఒక వైపు ఆరబెట్టుకుంటూ.. వైద్యం కోసం వచ్చిన రోగులకు దుర్వాసనలోనే మధ్యలోనే ప్రథమ చికిత్సలు అందిస్తూ ముక్కు మూసుకుని విధులు నిర్వహిస్తున్నారు. చెత్త పిచ్చిమొక్కలు తొలిగించి దవాఖానాను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని మున్సిపాలిటీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించినప్పటికీ, మున్సిపాలిటీ సిబ్బంది అటువైపు కూడా చూడకపోవడంతో వైద్య సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ సుభాష్

దుమ్ముగూడెం: మండలంలోని నరసాపురం గ్రామంలోని సూది రెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం కౌమార విద్య ఎయిడ్స్ పై వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ.. కౌమార దశలో కలిగే మార్పులను, వ్యక్తిగత పరిశుభ్రత పై మరియు ఎయిడ్స్ ఏ విధంగా సోకుతుందో, వ్యాధి సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ ఏవీ రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ రామ్ బాయమ్మ, ఏఎన్‌ఎంలు ధనలక్ష్మి, పూర్ణ, పాఠశాలలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులు జి.రత్నకుమారి, పి.తిరుపతి రావు, పి.విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంబీ నర్సారెడ్డి

బూర్గంపాడు: భారీ వర్షాలు, వరదలకు పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారమందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం బి.నర్సారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గోదావరి, కిన్నెరసాని వరదలకు బూర్గంపాడు మండలంలో వేలాది ఎకరాల్లో పంటనష్టం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ బృందం నష్టాన్ని అంచనాలు వేస్తున్నందున రైతులకు ఎకరాకు కనీసం రూ.20 వేల పరిహారమందించాలన్నారు. వరదలకు మృత్యువాత పడిన పశువులకు ఒక్కోదానికి రూ.50 వేలు, గొర్రెలు, మేకలకు రూ.10 వేల పరిహారమందించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పాండవుల రామనాథం, పాపినేని సరోజిని, ఎస్‌కె.అబీదా, బయ్యా రాము, గుంటక కృష్ణ, రాయల వెంకటేశ్వర్లు, కనకం వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ్ అభియాన్

ములకలపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పోషణ్ అభియాన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు, జన్మదినోత్సవాలు చేశారు. ఏసీడీపీఓ సీత మాట్లాడుతూ.. పోషకాహార ఆవశ్యకతపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సామ్రాజ్యం, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు బస్ పాసులు

గుండాల: ఆళ్లపల్లి మండల దివ్యాంగులకు బస్సు పాస్‌లు శిబిరం మండలం కేంద్రంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని శిబిరం నిర్వాహకులు ఇసనపల్లి శామ్యూల్, నరేందర్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు సదరం ధ్రువీకరణ పత్రం జిరాక్స్, ఆధార్ ధ్రువీకరణ పత్రం జిరాక్స్, ఒక ఫోటోతో పాటు ఆన్‌లైన్ చార్జ్ కోసం రూ.50లు వెంట తీసుకురావాలని సూచించారు.

నిత్యావసరాల పంపిణీ

అశ్వాపురం: లయన్స్‌క్లబ్ ఆఫ్ అశ్వాపురం వారి ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఫండ్ ద్వారా వరద బాధితులకు గురువారం నిత్యావసర సరుకులు లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ యారాల ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సింగం శ్రీధర్, శివప్రసాద్, కోటేశ్వరరావు, బాలయ్య, కాప్రా మురళి, తీగల మోహన్‌రావు, సోమిరెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై దాడి అమానుషం

దమ్మపేట: పోలీసుల సమక్షంలో కాంగ్రెస్ రౌడీలు బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడి అమానుషం అని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టపగలే ఒక ఎమ్మెల్యేపై దాడి చేస్తే, రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఎమ్మెల్యేలకు కూడా రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ వారికి ఒక న్యాయం, ప్రతిపక్షపార్టీ వారికి మరొక న్యాయమా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును విమర్శించారు.

గణేష్ మండపాల్లో పూజలు

బూర్గంపాడు: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గణేష్ మండపాల్లో ప్రత్యేకపూజలు, అన్నసమారాధన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. బూర్గంపాడులోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయ సన్నిధిలోని గణేష్ మండపంలో ఎస్సై రాజేష్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అక్కడ జరుగుతున్న అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటి ప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అన్నదానం..

మణుగూరురూరల్: వినాయకచవితి పంచమ రాత్రోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని వాసవినగర్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని మణుగూరు సీఐ సతీష్‌కుమార్, పట్టణ ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సీఐ సతీష్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌కేటీ గ్రూప్స్ చైర్మన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు దోసపాటి వెంకటేశ్వరరావు, ఎస్‌కేటీ గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి నాగేశ్వరరావు, వాసవినగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కత్తి రాము, దుగ్గి సతీష్‌కుమార్, శేషు, శ్రీనివాస్, వేముల వాసు, వాసవినగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని ఎంపీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రాంభించారు. ఈ కార్యక్రమంలో నక్క ప్రసాద్, తమ్మల వెంకటేశ్వరరావు, నవాబు, దయారం ప్రజాపతి, మల్లెల లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంటౌన్: శోభాయాత్రలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది



మణుగూరురూరల్: గణనాథుడిని దర్శించుకుంటున్న సీఐ సతీష్‌కుమార్

శోభాయాత్ర..

భద్రాచలం విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో విఘ్నేశ్వరుని ఆరు రోజుల పాటు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన గణేష్ నిమజ్జన శోభాయాత్రలో డివిజన్‌లోని కార్మికుల, ఉద్యోగులు, అధికారులు పాల్గొని మేళతాళాలతో డప్పు వాయిద్యాలు కోలాటాలు, డాన్సుల నడుమ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం డివిజన్ ఇంజనీర్ జీవన్ కుమార్, ఏడీ వేణు, రాజారావు, రోహిణి, జ్యోతి, యూనియన్ నాయకులు బొల్లి వెంకటరాజు, కోలగం రమేష్, భూక్య రామకృష్ణ, విద్యుత్తు గణేష్ మండలి కమిటీ సభ్యులు త్రినాథ్ రెడ్డి, సర్వేశ్వరరావు, ఏడుకొండలు, జగన్మోహన్ రెడ్డి, కూసరాజు శ్రీనివాస్, అభినయ్, రాఘవేంద్ర రావు, అశోక్ కార్మికులు, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: లడ్డూ అందిస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు

లడ్డూ వేలం పాట..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలోగల శ్రీ వరసిద్ది వినాయక ఆలయం వద్ద నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో గ్రామానికి చెందిన జ్ఞానాల శివ రూ.25వేలకు లడ్డూను కైవసం చేసుకోగా, కమిటీ బాధ్యులు అందజేశారు.